సాక్షి మంచిర్యాల

మంగళవారం । 2 । మే । 2023



కేజీబీవీలకు సెలవుల్లేనట్లే..!?

కేజీబీవీ టీచర్లు వేసవిలోనూ బడులకు రావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మే 31 వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకటించారు.

8లో▸



ఘనంగా మేడే వేడుకలు

ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు అరుణ పతాకం ఎగురవేశారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బుగ్గలో జూనియర్ సివిల్ జడ్జి పూజలు



పూజలు చేస్తున్న హిమబిందు దంపతులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.హిమబిందు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయం తరఫున అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. హిమబిందు దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే

• కలెక్టర్ బదావత్ సంతోష్



క్రీడా సామగ్రి అందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లోనూ మంచి ప్రావీణ్యం సాధించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో పాల్గొనడం ద్వారా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని, స్నేహభావం అలవడుతుందని వివరించారు. పట్టుదలతో సాధన చేసి క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలకు 171 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు సోమవారం 171 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు మొత్తం 647 మంది విద్యార్థులకు 574 మంది హాజరయ్యారు. ఇంటర్‌లో 878 మందికి 780 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

త్వరలోనే రెండోవిడత గొర్రెల పంపిణీ

• జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న రమేశ్ కుమార్

భీమారం: జిల్లా వ్యాప్తంగా త్వరలోనే రెండో విడత గొర్రెలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. భీమారంలో గొర్రెలు పంపిణీ అంశంపై యాదవులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒక్కో యూనిట్‌కు 75 శాతం సబ్సిడీ పోను మిగతా డబ్బులు డీడీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. దళారుల మాటలు నమ్మకుండా నేరుగా పశుసంవర్ధక శాఖ అధికారులను కలవాలని తెలిపారు. మేకలు, గొర్రెలు కల్గిన పెంపకం దారులు వేసవి ఎండల నుంచి జీవాలను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శంకర్, మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ, సర్పంచ్ గద్దె రాంరెడ్డి, యాదవులు పాల్గొన్నారు.

రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: రగ్బీ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్ల సత్యనా రాయణ, ఉపాధ్యక్షుడిగా కొండా చంద్రశేఖర్ ను ఎన్నుకుని సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రగ్బీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఆదిత్య, రగ్బీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శేషుగుప్తా, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేశ్ పాల్గొన్నారు.

చివరికి కన్నీళ్లే!



తడిసిన ధాన్యం చూపుతున్న ఈ రైతు దండేపల్లి మండలం కొర్విచెల్మకు చెందిన కొట్టె మల్లేశ్. ఈ యాసంగిలో ఎనిమిదెకరాల్లో వరి వేశాడు. ఇటీవలే పంట కోసి ధాన్యం స్థానిక కొనుగోలు కేంద్రంలో ఆర బోశాడు. వారం గడుస్తున్నా తూకం వేయలేదు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి పోయింది. కొనుగోలు కేంద్రాల్లో త్వరగా కాంటా వేసి రవాణా చేస్తే, ఈ నష్టం తప్పేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



హాజీపూర్ మండలం రాపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీటిలో ధాన్యం

• అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగం
• చేతికొచ్చిన పంటను మింగుతున్న వరుణుడు
• తడిసిపోయి, నీళ్లలో నానుతున్న ధాన్యం కుప్పలు
• కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు

యాసంగి వరి సాగు : 94,240 ఎకరాలు
ధాన్యం సేకరణ లక్ష్యం 2.28 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాల లక్ష్యం : 248
ఏర్పాటు చేసినవి : 87
కాంటా వేసినవి : 2,230 మెట్రిక్ టన్నులు
మిల్లులకు తరలించినవి 1,483 మెట్రిక్ టన్నులు



తడిసిన ధాన్యం ఎత్తుతున్న మహిళా రైతు



కొట్టుకుపోయిన ధాన్యం కుప్ప చేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాల అగ్రికల్చర్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట కాపాడుకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. నడి నిండు వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నారు. మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వడగండ్ల వానలకు వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అష్టకష్టాలు పడుతూ కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం కొనే వరకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో చాలా చోట్ల టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసిపోతోంది. తేమ శాతం పెరిగి కొనుగోళ్లు మరింత ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వందల మెట్రిక్ టన్నుల ధాన్యం మాయిశ్చర్ రాక కొనుగోలు చేయడం లేదు. మరోవైపు కాంటా అయ్యాక కూడా మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. శని, ఆదివారం కురిసిన ఈదురు గాలుల వర్షాలకు కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, మామిడి కాయలు నేల రాలాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. ఈ కేంద్రాల్లో ఏ రైతును కదిలించినా కన్నీళ్లే ఉబికి వస్తున్నాయి.

కొనుగోలు కేంద్రాల్లో అవస్థలు

జిల్లాలో గతనెల 19 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇంకా కొన్ని చోట్ల ప్రారంభించాల్సి ఉంది. 15 రోజులుగానే ధాన్యం రాక మొదలైంది. ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ కొన్ని మిల్లులకు ట్యాగింగ్ చేయకపోవడంతో ధాన్యం తరలింపులో ఆలస్యమవుతోంది. ఇక గన్నీ సంచులు, లారీలు సమకూర్చడం, రవాణా జాప్యం లేకుండా చూడాల్సిన అధికారుల సమన్వయ లోపంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు బ్లాక్ లిస్టులో పెట్టిన మిల్లులకు ధాన్యం పంపొద్దనే ఆదేశాలు, కొన్నిచోట్ల తేమ, తరుగు పేరుతో కొందరు యాజమాన్యం ధాన్యం తీసుకోవడంలోనూ మెలిక పెడుతున్నారు.

పంట నీటిపాలైంది



వరి కోసి 20 రోజులు అయితాంది. వడ్లు సెంటర్లో ఆరబోసి కాంటా పెడుతరని, ఎదురు చూస్తున్న. రాత్రి వానకు వరదలో వడ్లు కొట్టుకుపోయినయ్. చేతికొచ్చిన పంట నీటిపాలైంది. తడిసిన వడ్లు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– కిలిశెట్టి అనిత, పెద్దంపేట, హాజీపూర్ మండలం


15 రోజులైనా కాంటా పెట్టలే



సెంటర్‌కు వడ్లు తీసుకవచ్చి 15 రోజులు అయింది. ఎండలకు మంచిగా వడ్లు ఆరినయి. అయినా కాంటా పెట్టలేదు. రాత్రి, పగలు కాపాలాగాసిన. ఇప్పుడు వర్షానికి నానుతున్నాయి. పంట వానల నాని నష్టపోవుడే అయితంది.

– నగరపు భూమయ్య, టీకానపల్లి, హాజీపూర్ మండలం

అప్పులు చేసి సాగు..



పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులు చేసి సాగుచేస్తే వానలకు ధాన్యం నీటి పాలైంది. ప్రభుత్వం బాధ్యత తీసుకుని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– ఎండీ యూసఫ్, సారంగపల్లి, మందమర్రి మండలం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అకాల వర్షానికి హాజీపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కళ్ల ముందే ధాన్యం కొట్టుకుపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ధాన్యం కుప్పల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో వాటిని తొలగించడంలో కూడా రైతులు అవస్థలు పడ్డారు. దొనబండ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అండగా ఉంటానని తెలిపారు. కలెక్టర్ సంతోష్, పౌరసరఫరాల అధికారి, డీఎస్‌వోతో ఫోన్‌లలో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని కోరారు.

కోటపల్లి: మండలంలో రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు బోప్పారం, ఎసన్‌వాయి, కొండంపేట, నాగంపేటలో వరి పంటలు పూర్తిగా దెబ్బతినగా సోమవారం ఏవో మహేందర్ పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు.

భీమారం: మండలంలోఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ధర్మారం, దాంపూర్, మద్దికల్, కొత్రిదుబ్బ, ఎలకేశ్వరం గ్రామాల్లో వరిపంటకి తీవ్రంగా నష్టం వాటిల్లింది.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని మాలగురిజాల, చర్లపల్లి, రంగపేట, గురిజాల, చంద్రవెల్లి, లంబాడితండా, బట్వాన్‌పల్లితోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లంబాడితండాలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

వేమనపల్లి: ఈదురుగాలులతో మండలంలో వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి.

లక్సెట్టిపేట: మండలంలో వర్షానికి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. వరి పొలాలు పూర్తిగ పడిపోవడంతో కోయడానికి వీలు లేకుండా పోయింది.

చెన్నూర్‌రూరల్: మండలంలో కిష్టంపేట, ఎర్రగుంటపల్లెలో వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో కురిసిన అకాల వర్షానికి వరి పంట నేలకొరిగింది.

నెన్నెల: అకాల వర్షానికి మామిడికాయలు నేలరాలిపోగా చేతికి వచ్చిన వరి నేలపాలైంది. మండలంలోని గంగారాం, చిత్తాపూర్, ఆవుడం, గుండ్ల సోమారం, గొల్లపల్లి, జోగాపూర్, నందులపల్లి, మైలారం, నెన్నెల తదితర గ్రామాల్లో వరి నేలకొరగగా మామిడికాయలన్నీ నేలపాలయ్యాయి.

జన్నారం: అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

జైపూర్: అకాల వానలతో జైపూర్‌తోపాటు నర్వా, ముదిగుంట, కాన్కూర్, ఇందారం, రామారావుపేట, టేకుమట్ల, శెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గ్రామాలలో సుమారు 400 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

దంచికొట్టిన వాన

• జిల్లాలో 40.4 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదు
• హాజీపూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి, నస్పూర్ మండలాల్లో అధికం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగైదు రోజులుగా అకాల వర్షాలు అన్నదాత కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈదురు గాలులు, వడగండ్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మార్లు అకాల వర్షం కురవడంతో రైతులు కుదేలు అవుతున్నారు. వరి కోసిన రైతులు, వరి కోయని రైతులు పంటను కాపాడు కోవడానికి తంటాలు పడుతున్నారు. పంట చేతికి వచ్చిన సమయంలో కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్ట పోతున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 40.4 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైంది. అత్యధికంగా బెల్లంపల్లి, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, మందమర్రి మండలాల్లో కురిసింది. ఇన్నాళ్లు ఎండలతో బోసిపోయిన ఒర్రెలు, వాగులు, వంకలు, కాల్వలు వర్షంతో పొంగి ప్రవహించాయి. పొలాలు చెరువులను తలపించాయి. బలమైన ఈదురు గాలులకు హాజీపూర్, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి మండలాల్లో రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జిల్లా వ్యాప్తంగా 15,600 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు సమాచారం.

రెండు రోజులుగా అతలాకుతలం..

శనివారం తెల్లవారుజామున, ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో వందల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. తూకం వేసిన ధాన్యంతోపాటు రాశులుగా పోసిన ధాన్యం తడిసిపోయింది. పంటను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. ఈదురుగాలులకు కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, మామిడి పంటలు నేలరాలాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. ధాన్యం సేకరణ ఆలస్యమవడంతో నష్టపోయామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 40.4 మిల్లిమీటర్ల వర్షం కురిసింది. బెల్లంపల్లిలో 68.6 మిల్లిమీటర్లు, హాజీపూర్‌లో 60.7 మిల్లి మీటర్లు, మంచిర్యాలలో 62.2, మందమర్రిలో 57.4, నస్పూర్‌లో 57.4, భీమినిలో 51, కన్నెపెల్లిలో 45.8, నెన్నెలలో 43.3, కాసిపేటలో 41.7, తాండూర్‌లో 34.6, జైపూర్‌లో 39.3, చెన్నూర్‌లో 34.4, కోటపల్లిలో 30.4, వేమనపల్లిలో 34.7, భీమారంలో 29.5, లక్సెట్టిపేటలో 18.4, దండేపల్లిలో 23.5, జన్నారంలో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

• కలెక్టర్ బదావత్ సంతోష్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: భూ సమస్యలు, వృద్ధాప్య పెన్షన్, విద్యుత్ సమస్య, మురికి కాలువ తదితర సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు జిల్లాలోని పలు మండలాల నుంచి అర్జీదారులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బిల్లు అందించాలి..



నేను ఐహెచ్‌హెచ్‌ఎల్ ఎస్‌బీఎం పీహెచ్ ఏఎస్ఈ-2లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్నాను. 2021, జనవరి 20న ఎఫ్‌టీవో జనరేట్ చేశారు. దీనికి మొత్తం రూ. 24 వేలు 19 ఏప్రిల్ 2021న అకౌంట్ 39235547550 నుంచి రూ.10,200 రెండు చెక్కులు అందించారు. నగదు కోసం బ్యాంకు చుట్టు తిరుగుతున్నా నగదు ఇవ్వడం లేదు. బిల్లు ఇప్పించాలి.

– సంద్ర, భూమయ్య, పులిమడుగు

పట్టా మార్పిడి చేయాలి..



భీమారం మండలం దాంపూర్ శివారులోని 41 సర్వే నంబర్‌లో 3.41 ఎకరాల భూమి ఉంది. అది ఇతరుల పేరుమీద పట్టా అయింది. ఆ భూమిని మా తాత, తండ్రులు కొండ లచ్చెమల్లు, కొండ పోషమల్లు, కొండ నారాయణ సాగు చేసుకుంటున్నాం. ఇప్పటి వరకు కాస్తులో మా పేరు ఉంది. ధరణి పోర్టల్ వచ్చాక ఇతరుల పేరుమీద పట్టా చూపిస్తుంది. పట్టా పేరు మార్చి కొత్త పాసుపుస్తకం ఇవ్వాలి.

– కొండ అంజన్న, కొండ రవి, కొండ చంద్రశేఖర్

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మంచిర్యాలఅర్బన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే ఫైల్‌పై కొత్త సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేయడంతో మంచిర్యాల ఐటీఐలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం పాలాభిషేకం చేశారు. జిల్లాలో 230 మంది ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపినందుకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలో 21 మందిని పర్మినెంట్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ రమేశ్, డీటీవోలు శ్రీధర్‌రాజు, హఫీజ్, ప్రకాశ్ రావు, కాంట్రాక్ట్ ఏటీవోలు రాజేందర్, షోయబ్, శశి కుమార్, సంధ్యారాణి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో..

కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసినందుకు మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 23 ఏళ్ల పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేయటంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా డీఐఈవో శైలజను మర్యాద పూర్వకంగా కలుసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రకుమార్, జనరల్ సెక్రటరీ బండి ప్రసాద్, ఉపాధ్యక్షులు రామయ్య, సందీప్, సహాయ కార్యదర్శి అరవింద్, మహిళా కార్యదర్శి అనిత, బషీర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

వైద్యశాఖలో క్రమబద్ధీకరణ

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 34 మంది రెగ్యులరైజ్ కానున్నారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్లుగా 26 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఏడుగురు, ఒక ఫార్మసిస్టు ఉన్నారు. వీరు సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడును సన్మానించారు.

కేటీఆర్ సభాస్థలి పరిశీలన

బెల్లంపల్లి: ఈనెల 8న రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి బెల్లంపల్లికి రానున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సభాస్థలిని సోమవారం పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి పనుల గురించి చర్చించారు.



క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

వెంటాడిన మృత్యువు

• రెండు నెలల క్రితం తృటిలో తప్పిన మృత్యుగండం
• తాజాగా రోడ్డు ప్రమాదంలోనే దుర్మరణం

తాండూర్: మృత్యువు ఆ యువకుడిని వెంటాడింది. మొదటిసారి తృటిలో తప్పించుకున్నాడు. రెండోసారి మృత్యువే గెలిచింది. రోడ్డు ప్రమాద రూపంలో అతడిని కబళించింది. మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన అన్నారపు శ్రీనివాస్ తన తోటలో కాసిన మామిడి కాయలను మహారాష్ట్రలోని నాగపూర్ మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఈమేరకు జోగాపూర్‌కు చెందిన విజయ్‌తో కలిసి తన వాహనంలో కా యలు లోడ్ చేశారు. ఆదివారం రాత్రి నాగపూర్ బయల్దేరారు.

బావ మాట కాదనలేక..

బెల్లంపల్లి వరకు రాగానే శ్రీనివాస్ తన బావమరిది తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్‌కు ఫోన్ చేశాడు. తోడుగా రమ్మని కోరాడు. బావ మాట కాదనలేక మల్లేశ్ ఓకే చెప్పాడు. మార్గమధ్యంలో బోయపల్లికి చేరుకుని శ్రీనివాస్‌ను కూడా వాహనంలో ముగ్గురూ నాగపూర్ మార్కెట్‌క బయల్దేరారు. కాసేపట్లో మామిడి మార్కెట్‌కు చేరుకునే క్రమంలో బుట్టిబోరి వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాన్ని అన్నారపు శ్రీనివాస్ నడుపుతున్నాడు. ఈ ఘటనలో రాదండి మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విజయ్ తలకు, చేతులకు గాయాలయ్యాయి. శ్రీనివాస్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మల్లేశ్



మల్లేశ్(ఫైల్)



లారీని ఢీకొట్టిన బొలెరో వాహనం

అకాల మృతితో బోయపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. అందరితో కలివిడిగా ఉండే మల్లేశ్ మృతిపై స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

రెండు నెలల క్రితం తప్పించుకుని..

రెండు నెలల క్రితం బెల్లంపల్లి శివారు తిరుమల హిల్స్ వద్ద సెంట్రింగ్ కూలీలు ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ వాహనంలో మల్లేశ్ కూడా ఉన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడి కక్కడే మృతి చెందారు. మల్లేశ్‌కు ఎలాంటి గాయాలు తగలకుండా ప్రాణాలతో బయటపడ్డాడు. కానీ, మృత్యువు మల్లేశ్‌ను విడిచి పెట్టలేదు. ఆది, సోమవారం సెలవులు కావడంతో శ్రీనివాస్ తన వెంట నాగపూర్ రావాలని మల్లేశ్‌ను పిలిచాడు. బావ పిలుస్తున్నాడని భావించాడు కానీ, మృత్యువు పిలుస్తోందని ఊహించలేదు. నాగపూర్ వద్ద రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మల్లేశ్‌కు భార్య సంగీత, ఏడాదిన్నర వయసు కూతురు ప్రబుది ఉన్నారు. మల్లేశ్ తల్లిదండ్రులు రుక్కమ్మ, రాజయ్య గ్రామంలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో పశువులు మృతి



పెంచికల్‌పేట్‌: మృతి చెందిన పశువులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మండలంలోని గఢ్‌పూర్, బాబానగర్‌లకు చెందిన నాలుగు ఆవులు, ఒక ఎద్దు సోమవారం విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో విద్యుత్‌ వైర్లు తెగిపడటంతో ఉదయం మేతకు వెళ్లిన పశువులు తీగలను తగిలి అక్కడికక్కడ మృతిచెందాయి. మండల పశువైద్యాధికారి డాక్టర్‌ పశువైద్యాధికారి శాంతిరేఖ పంచనామా చేయగా విద్యుత్‌ ఏఈ మహేందర్‌రెడ్డి పశువుల మృతి నివేదికను ఎస్‌ఈ కార్యాలయంలో అందజేస్తామని తెలిపారు. బాధితులు అల్లంల రాజశేఖర్, కరిడె రాజయ్య, గోళ్ల భూమయ్య, ఇండ్ల శ్రీనివాస్‌లకు చెందిన ఒక్కో పశువుకు రూ. 40 వేల నష్టపరిహారం వస్తుందని ఏఈ తెలిపారు.

కోటపల్లి: చెన్నూర్‌ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ తగిలి ఆవు మృతిచెందినట్లు యజమాని కొమటిపల్లి రమేశ్‌ తెలిపారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ఆవు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని రమేశ్‌ తెలిపారు. అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

పెంచికల్‌పేట్‌: పెంచికల్‌పేట్‌ సమీపంలో విద్యుత్‌షాక్‌తో ఒక ఎద్దు, ఆవు, లేగ దూడ మృతి చెందాయి. బాధిత రైతులు చప్పిడే మధుకర్, దాసరి శంకర్, సామెర రాములు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో విద్యుత్‌ తీగలు తెగిపడ్డాయి. సోమవారం ఉదయం మేతకు వెళ్లిన పశువులు తిరిగి వస్తున్న క్రమంలో విద్యుత్‌ తీగలు తగిలి ఐదు పశువులు మృతిచెందాయి. గమనించిన స్థానికులు విద్యుత్‌ సరఫరా నిలిపివేయడంతో రెండు పశువులకు ప్రాణాపాయం తప్పింది. సంఘటన స్థలాన్ని విద్యుత్‌ ఏఈ అంజల్‌ కుమార్‌ సందర్శించి బాధిత రైతులకు పరిహారం అందిస్తామన్నారు.

కిక్‌బాక్సింగ్‌ విజేతగా మంచిర్యాల జిల్లా



మెమొంటో అందిస్తున్న ముఖేశ్‌గౌడ్‌

మంచిర్యాలటౌన్‌: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కిక్‌ బాక్సింగ్‌ పోటీల విజేతగా మంచిర్యాల జిల్లా గెలుపొందింది. రాష్ట్రస్థాయి నుంచి వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, విజేతగా మంచిర్యాల జిల్లా, రన్నర్‌గా నిర్మల్‌ జిల్లా, మూడో స్థానంలో జగిత్యాల జిల్లా గెలుపొందింది. విజేతలకు మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గాజుల ముఖేశ్‌గౌడ్, కిక్‌ బాక్సింగ్‌ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌లు మెమొంటోలు అందజేశారు.

ప్రమాదవశాత్తుబావిలో పడి వ్యక్తి మృతి

తాండూర్‌: ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతిచెందాడు. ఏఎస్సై మధుసూదన్‌ కథనం ప్రకారం.. తాండూర్‌ గ్రామానికి చెందిన అబ్బుర్ల రాయమల్లు (45) ఇంటి వద్ద ఉన్న బావిలో నీళ్లు చెదడానికి వెళ్లాడు. సోమవారం నీళ్లు చేదుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే అతడిని బావిలో నుంచి బయటకు తీసి బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి పంపించారు. రాయమల్లును పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం



హాజీపూర్‌ మండలం టీకానపల్లిలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న దుర్గం పుష్పలత

చిత్తాపూర్‌లో నేలరాలిన మామిడి కాయలు



కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం, తడిసిన ధాన్యం



నెన్నెల: గంగారాంలో నేలకొరిగిన వరిపంట



కోటపల్లి మండలం ఎసన్‌వాయిలో..



కొండపల్లిలో నేలకొరిగిన వరి పంట

ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు..రైతులకు అపార నష్టాన్ని మిగుల్చుతున్నాయి. గతమూడు రోజులుగా ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వులు, శనగ, పెసర, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన మామిడికాయలు రాలగా, వరి పంటలు నేలకొరిగింది. కళ్లముందే పంటలు నేలపాలు కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల రోడ్లపైకి ధాన్యం కొట్టుకొచ్చింది. ఇప్పటివరకు వేల ఎకరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. - సాక్షి నెట్‌వర్క్‌



ఆదిలాబాద్‌ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



హాజీపూర్‌ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యం




బెల్లంపల్లిలో విద్యుత్‌ తీగలపై విరిగిపడ్డ చెట్లు

కేజీబీవీలకు సెలవుల్లేనట్లే..!?

- ప్రతీరోజు స్కూల్‌కు రావాలని ఆదేశాలు
- విద్యాశాఖ నిర్ణయాలపై టీచర్ల అసంతృప్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

జిల్లా	కేజీబీవీలు	టీచింగ్‌	నాన్‌టీచింగ్‌
మంచిర్యాల	18	193	133
ఆదిలాబాద్‌	17	230	231
నిర్మల్‌	18	187	206
కుమురం భీం	15	165	126



కేజీబీవీల్లో టీచర్లు, నాన్‌టీచర్లపై జిల్లాల వారీగా ఏప్రిల్‌ 28న బయోమెట్రిక్‌ అటెండెన్స్‌ గ్రాఫ్‌

మంచిర్యాలఅర్బన్‌: రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్‌ 25 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. ఇదివరకు సెలవుల్లో విద్యాసంస్థలు అడ్మిషన్లు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇంతలోనే నిబంధనలు తుంగలో తొక్కి పేద, వెనుకబడిన మధ్యలో బడి మానేసినా బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీల) టీచర్లను బడులకు రావాలని ఆదేశాలు జారీపై గందరగోళం నెలకొంది. మునుపెన్నడూలేని విధంగా ఏ పాఠశాలల యాజమాన్యాల్లో లేని ఆంక్షలు కేజీబీవీలో విధులు నిర్వహించే నాన్‌టీచింగ్, నాన్‌టీచింగ్‌పై విధించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పిల్లలందరూ ఇంటిపట్టున ఉంటే టీచర్లంతా బడికి వెళ్లాలనే హుకుంపై పెదవి విరుస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను పర్మినెంట్‌ ప్రక్రియ చేపట్టగా..ఇంకోవైపు కేజీబీవీల్లో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న టీచర్ల క్రమబద్ధీకరణ మాటదెవుడేరుగు వేసవి సెలవులు అమలు చేయకపోవడంపై టీచర్లు వాపోతున్నారు.

బడికి వెళ్లాల్సిందే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్‌ విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు లేకపోయినా టీచర్లు బడికి వెళ్లి విధులు నిర్వహించాలని జూమ్‌ మీటింగ్‌ ద్వారా సూచించారు. టీచర్లు మే 31 వరకు సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ చేయాలని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. వీరికి మూడు రకాల విధులు కేటాయించారు. స్కూల్లో ఉంటూ అడ్మిషన్లు చేపట్టడం.. చుట్టుపక్కలా గ్రామాలకు వెళ్లి అడ్మిషన్ల కోసం గ్రామాలకు వెళ్లి ప్రచారం చేపట్టడం .. ఆన్‌లైన్‌ క్లాస్‌లు నిర్వహించాలని సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా ప్రతిక్లాస్‌లో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆరో తరగతిలో 40 మందికి అవకాశాం ఉంటుంది. మిగిలిన క్లాస్‌లో ఎవరైనా వెళ్లిపోతే ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంటుంది. విద్యాసంస్థల పునఃప్రారంభం కాకముందే నిర్దేశిత లక్ష్యం 40 మంది అడ్మిషన్లు పూర్తయి సీట్లు దొరకని పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు కొత్తగా గ్రామాలకు వెళ్లి క్యాన్వసింగ్‌ చేయడం దేనికో అధికారులకు తెలియాలి. ఆన్‌లైన్‌ క్లాస్‌లు ఇంటిపట్టున ఉండి కూడా నిర్వహించవచ్చని టీచర్లు గుర్తుచేస్తున్నారు. బడులకు ఒకరిద్దరూ వెళ్తే సరిపోతుందని పూర్తిస్థాయిలో టీచర్లు వెళ్లాల్సిన అవసరం లేదనేది సంఘాల అభిప్రాయపడుతున్నాయి. నాన్‌టీచింగ్‌ సిబ్బంది పోపు డబ్బాలు క్లీనింగ్, ప్రాంగణాలు శుభ్రం చేయడం, కిచెన్‌ గార్డెన్‌కు ఏర్పాట్లు చేసుకోవాలనే చెప్పడం చర్చానీయంశంగా మారింది. అకౌంట్స్‌ రిపోర్టులు నివేదించడం.. ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా రావాలని సూచించడంపై ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఇవన్నీ రోజు వారీ కార్యక్రమాలు కాగా ప్రత్యేకంగా సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ అంటూ పిల్లలు లేకుండా బడులు తెరవాలనే విద్యాశాఖ వింత నిర్ణయాలు టీచర్లు, సంఘాలు తప్పుబడుతున్నారు. ఎప్పటిలాగే కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లు, నాన్‌టీచింగ్‌కు సెలవులు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

సెలవుల్లో విధులు సరికాదు

కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్‌ స్టాఫ్‌ను వేసవి సెలవుల్లో పనిచేయాలనడం సరికాదు. ఉద్యోగులకు సెలవులు అమలు చేయాలి. సెలవుల్లో విధులు నిర్వహించాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి.

– బగ్గని రవికుమార్, తపస్‌ ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

ఉన్నతాధికారుల ఆదేశానుసారం కేజీబీవీల్లో విధులు నిర్వహించే టీచర్లు తప్పనిసరిగా బడికి వెళ్లాలి. యాక్షన్‌ ప్లాన్‌ తయారు చేయడం..బయోమెట్రిక్‌ అటెండెన్స్‌ వేయాలి.

– పద్మజ, సెక్టోరల్‌ అధికారి, మంచిర్యాల

శెభాష్‌ పోలీసులు



విజేందర్‌రెడ్డిని బయటకు తీసుకువస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం: నాలుగు నిమిషాల వ్యవధిలో ఓ నిండు ప్రాణం కాపాడి బ్లూకోర్ట్‌ పోలీసులు శభాష్‌ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాలకు చెందిన న్యాలకొండ విజేందర్‌రెడ్డి(65) సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్‌ అయ్యాడు. కొడుకుల ఉన్నత విద్యకోసం ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో నిగచ్చిబౌలి ప్రాంతంలో ఉంటున్నాడు. కాగా, ఆదివారం విజేందర్‌రెడ్డి భార్య హేమలత మధ్య గొడువ జరిగింది. తీవ్ర మనస్తాపంతో విజేందర్‌రెడ్డి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం భార్యకు ఫోన్‌ చేసి మంచిర్యాలలోని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. హేమలత వెంటనే పోలీసులకు చెప్పడంతో స్పందించిన బ్లూకోర్ట్‌ సిబ్బంది ఉస్మాన్‌పాష, సంపత్‌ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హేమలత భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుండగా అతన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నాలుగు నిమిషాల వ్యవధిలో ఓ నిండుప్రాణం కాపాడిన బ్లూకోర్ట్‌ కానిస్టేబుళ్లను సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుదీర్‌ రాంనథ్‌ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు.

పురుగుల మందు తాగి ఒకరు..

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మండలంలోని ఎడవెల్లికి చెందిన మిట్ట శంకర్‌ (50) పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భూమేష్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే శంకర్‌కు గత సంవత్సరంన్నర క్రితం పక్షవాతం రాగా కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన శంకర్‌ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి శీతలపానీయంలో గుర్తు తెలియని పురుగుల మందు కలుపుకొని తాగాడు. భార్య ప్రమీల గమనించి 108లో ఆసిఫాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

కాసిపేట: మద్యానికి బానిసై ఒకరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ కె.సురేష్‌గౌడ్‌ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఏల్పుల రాజేశం(47) ఓరియంట్‌ సిమెంట్‌ కంపెనీ దేవాపూర్‌లో రోజువారి కూలీగా పనిచేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్తాపం చెందాడు. సోమవారం మధ్యాహ్నం సోమగూడెం సమీపంలోని రైల్వేట్రాక్‌కు వెళ్లాడు. మంచిర్యాల నుంచి బల్లార్ష వైపు వెళ్లే గూడ్స్‌ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు. ఎస్సై ఆదేశాలతో కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం భార్య లక్ష్మికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

సింగరేణిలో అరుణపతాక రెపరెపలు



ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య

- ఘనంగా మేడే



శ్రీరాంపూర్‌ బస్టాండ్‌లో కార్మికునికి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

శ్రీరాంపూర్‌: సింగరేణి గనులపై, కార్మికవాడల్లో అరుణపతకాలు రెపరెపలాడాయి. కార్మికుల పోరాట దినోత్సవం మేడేను ఆదివారం సింగరేణి కార్మికవర్గం ఘనంగా జరుపుకుంది. కార్మికులు, కార్మిక సంఘాల నేతలు గనులపై, యూనియన్‌ కార్యాలయాల వద్ద ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌ బస్టాండ్‌లోని కార్మికుని విగ్రహం వద్ద నుంచి నర్సయ్య స్తూపం వరకు ర్యాలీ తీశారు. యూనియన్‌ కార్యాలయాల వద్ద ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శిస్కె బాజీసైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శులు కొట్టె కిషన్‌రావు, కొమురయ్య పాల్గొన్నారు.

- హెచ్‌ఎమ్మెస్‌ ఆధ్వర్యంలో ఎస్సార్పీ 1 గనిపై యూనియన్‌ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య ఎర్ర జెండా ఎగురవేశారు. కేంద్ర కమిటీ నాయకులు అనిల్‌రెడ్డి, నాయకులు మీస కొమురయ్య, నామాల శ్రీనివాస్, అశోక్, ఆర్‌ సందీప్, కె.శ్రీనివాస్, నవీన్, తొగరి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.
- నస్పూర్‌ షిర్కేలోని టీబీజీకేఎస్‌ కార్యాలయం వద్ద యూనియన్‌ కేంద్ర ఉపాధ్యక్షుడు డి.అన్నయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్‌ ఏరియా కార్యదర్శి అశోక్, నాయకులు బ్రహ్మచారి, రౌతు సత్యనారాయణ, మల్లేశ్, విజయ్, ప్రేంకుమార్, ప్రణయ్, ప్రతాప్, సమ్మయ్య, తిరుపతి, జగదీశ్‌కుమార్‌ పాల్గొన్నారు.
- శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ యూనియన్‌ కార్యాలయం వద్ద యూనియన్‌ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, కార్యదర్శి భాగ్యరాజ్‌ ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో మేడే జరిగాయి. ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్‌ రంగు రాజేశం ఈ సందర్భంగా అరుణపతాకం ఎగురవేశారు. నాయకులు చంద్రశేఖర్, బాలాజీ, వెంగళ శ్రీనివాస్, రాజయ్య, కుమారి, మహేందర్, సుధాకర్, అజయ్, సది పాల్గొన్నారు.
- శ్రీరాంపూర్‌ బస్టాండ్‌లోని కార్మికుని విగ్రహం వద్ద సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. అసోసియేషన్‌ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, నాయకులు సత్యనారాయణ, నారయ్య, శ్రీనివాస్, సురేశ్, సంపత్, నాగయ్య, తిరుపతి, కార్తీక్‌ పాల్గొన్నారు.
- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్‌ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. శ్రీరాంపూర్‌ లోని సోమవారం సంత నుంచి కార్మికవాడల్లో ర్యాలీ తీశారు. అనంతరం ఎస్‌అండ్‌పీసీ కార్యాలయం తదితర చోట్ల జెండా ఆవిష్కరించారు. యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, జీఎల్‌బీకేఎస్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిష్టన్న పాల్గొన్నారు.
- సింగరేణి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌ నర్సరీ వద్ద ఆవిష్కరించారు. బెల్లంపల్లి రీజియన్‌ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు వీరే శం, ప్రభాకర్, తిరుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

కార్మికులకు శ్రమశక్తి అవార్డులు



అవార్డు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శ్రీరాంపూర్‌/బెల్లంపల్లి/మందమర్రిరూరల్‌: మేడే సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ సింగరేణిలో పలువురు కార్మిక నేతలకు శ్రమశక్తి అవార్డులను అందించింది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన మేడే ఉత్సవాల్లో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించారు. శ్రీరాంపూర్‌ డివిజన్‌ నుంచి అవార్డు అందుకున్న వారిలో టీబీజీకేఎస్‌ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి పానుగంటి సత్తయ్య, నాయకుడు శ్రీనివాస్‌రావు ఉన్నారు. అవార్డు గ్రహీతలను టీబీజీకేఎస్‌ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అభినందించారు. తెలంగాణ ఉద్యమకారుడు, టీబీజీకేఎస్‌ నాయకుడు, సింగరేణిలో సీనియర్‌ మైనింగ్‌ సర్దార్‌గా పనిచేస్తున్న బెల్లంపల్లికి చెందిన గజ్జెల్లి చంద్రశేఖర్‌ని రాష్ట్రస్థాయి శ్రమశక్తి అవార్డు వరించింది. ఆయన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రేణికుంట్ల ప్రవీణ్, టీబీజీకేఎస్‌ నాయకులు అభినందించారు. మందమర్రి ఏరియా శంకర్‌రావు, జీడి బాపు, ఈశ్వర్, బాబురావు, రాంచందర్, మాదవరెడ్డి, పెంద్రి రాజిరెడ్డి, తోట రాజిరెడ్డి, ఇప్ప సమ్మయ్య ఉన్నారు. టీబీజీకేఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, బీఆర్‌ఎస్‌ ఏరియా అధ్యక్షుడు జెంగిళి రవీందర్, రాజశేఖర్‌ తదితరులు అవార్డు గ్రహీతలను అభినందించారు.